## క్లుప్తంగా

### అంజన్నను దర్శించుకున్న భక్తులు



భక్తులతో మద్ది ఆలయం

**జంగారెడ్డిగూడెం రూరల్:** మండలంలోని గుర వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు చేశారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదాయం రూ.1,10,775 వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. 1,000 మంది భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారన్నారు. ఆలయ ధర్మకర్తలు దండు వెంకట కృష్ణంరాజు, కర్పూరం రవి, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పాల్గొన్నారు.

### 3,168 కొత్త పింఛన్ల మంజూరు

**బుట్టాయగూడెం:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం సాయంత్రం బుట్టాయగూడెం మండలం దుద్దుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పోలవరం నియోజకర్గం ఏడు మండలాల పరిధిలో కొత్తగా 3,168 మందికి పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. వీటిలో బుట్టాయగూడెం 536, జీలుగుమిల్లి 335, కొయ్యలగూడెం 646, కుక్కునూరు 439, పోలవరం 459, టి.నర్సాపురం 490, వేలేరుపాడు 263 చొప్పున కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని వివరించారు. వీరందరికీ వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే పింఛన్లు అందిస్తామని చెప్పారు.

### వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి

**కుక్కునూరు:** అమరవరం పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతూ సీపీఐ నాయకులు మంగళవారం అమరవరం పీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేశారు. అమరవరం పీహెచ్‌సీ పరిధిలో అనేక గ్రామాల్లో మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నా వైద్యాధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని ఆరోపించారు. ఆయా గ్రామాల్లో వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి కోరారు. నాయకులు పల్లెల బిక్షం, సోడే నాగేష్, ఇరమయ్య తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణానికి అనువుగా మట్టి విగ్రహాలు



కన్నాపురం సమీపంలో రూపుదిద్దుకుంటున్న మట్టి విగ్రహాలు

**కొయ్యలగూడెం:** వినాయక చవితి నేపథ్యంలో పర్యావరణానికి అనువుగా మట్టి విగ్రహాల రూపకల్పనకి శ్రీకారం చుట్టాడు శిల్పి నాగవరపు సీతారాముడు. కన్నాపురం గ్రామ సమీపంలోని ఇటికల బట్టి నిర్వాహకుడైన సీతారాముడు ప్రతి సంవత్సరం వినాయక చవితి, దసరా ఉత్సవాల సందర్భంగా వినాయక విగ్రహాలను, దశమికి అమ్మవారి విగ్రహాలను మట్టిని వినియోగించి రూపకల్పన చేస్తున్నాడు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వల్ల పర్యావరణానికి కలుగుతున్న హానిపై విస్తృత ప్రచారంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మట్టి విగ్రహాలను కొన్నేళ్లు రూపొందిస్తున్నట్లు సీతారాముడు తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు పట్టే సమయం కన్నా రెండింతల అధిక సమయం మట్టి విగ్రహాల తయారీకి పడుతుందని శిల్పి వివరించారు. ఆర్డర్ల మేరకు విగ్రహాలను తయారు చేస్తున్నట్టు తెలిపాడు.

### నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

**జంగారెడ్డిగూడెం:** నిరుద్యోగ యువతీ యువకుల నైపుణ్యాల అభివృద్ధికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌజల్ వికాస్ యోజన 4.0 ద్వారా స్వల్పకాలిక నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలోని నాక్ శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో రెండు నెలల శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. 9, 10 తరగతులు, ఐటీఐ పూర్తి చేసి, 45 ఏళ్లలోపు వయసు గల వారు అర్హులని, ఈ నెల 19 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ నాగరాజు సెల్ నెంబర్ 91823 42688లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### నేడు మండల సమావేశం

**లింగపాలెం:** లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం తెలిపారు.

# అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



లబ్ధిదారులకు బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**పోలవరం రూరల్:** అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలను అందిస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆయన పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ రెడ్డి నాగంపాలెం, పేడ్రాల, మణుగోపుల, కోయ నాగంపాలెం గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన మేలు, ప్రజలకు పథకాలు అందుతోన్న తీరును బాలరాజు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి దళారుల ప్రమేయం లేకండా నేరుగా పథకాలను ప్రజలకు అందిస్తున్నట్టు చెప్పారు. విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని తెలిపారు. పథకాలు అందని వారుంటే వెంటనే వలంటీర్ ద్వారా సచివాలయానికి దరఖాస్తు చేసుకుంటే లబ్ధి చేకూరుతుందని అన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పేదల అభివృద్ధికి అడ్డుపడుతున్న టీడీపీకి ప్రజలు గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అబద్ధపు హామీలతో మోసగించేందుకు చంద్రబాబు సిద్ధమవుతున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల అభివృద్ధితో పాటు ప్రజల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో పెరుగుతోన్న ఆదరణ చూసి ఓర్వలేకే ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమవుతున్నాయని ఆరోపించారు. కోయనాగంపాలెం నుంచి కుంకాల గ్రామం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందుతోన్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. పిల్లల ఆహారం విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ వి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోటం గంగాదేవి, మండల ఉపాధ్యక్షుడు మిడియం సింగరాజు, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాన్, ఎంపీడీఓ జి.శ్రీను, సీఐ కె.విజయబాబు, కార్యదర్శి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోటం బాబూరావు, పాడుం శ్యాం, నార్గాని పోశారావు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పాఠశాల ఆకస్మిక తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జెడ్పీటీసీ

**కామవరపుకోట:** మండలంలో జలపువారిగూడెం మండల పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను జెడ్పీటీసీ రమేష్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. భోజనం నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యతతో, రుచికరంగా భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి రమేష్ భోజనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చొక్కా స్వర్ణ, ఎంపీటీసీ గోరిక క్రాంతికుమారి, కృష్ణారెడ్డి, రఘుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శివన్నారాయణ పాల్గొన్నారు.

### 14న ఏఐకేఎంఎస్ జిల్లా మహాసభలు

**జంగారెడ్డిగూడెం:** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఏడో జిల్లా మహాసభలు ఈనెల 14న కామవరపుకోటలో నిర్వహించనున్నట్టు ఏఐకేఎంఎస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో మంగళవారం నిర్వహించిన ఏఐకేఎంఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐకేఎంఎస్ సభలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏఐకేఎంఎస్ నాయులు, రైతులు, రైతు కూలీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తమ సంఘం గోదావరి లోయ ఉద్యమాల ప్రేరణతో పురుడుపోసుకుందని చెప్పారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి సముద్రాల బాలసుందర్రావు, అధ్యక్షుడు కలింపూడి సుందర్రావు, సహాయ కార్యదర్శి బోడ ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా స్కూల్ గేమ్స్



రెడ్డిగణపవరంలో వాలీబాల్ ఆడుతున్న బాలికలు



నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

**బుట్టాయగూడెం:** మండలంలోని రెడ్డిగణపవరంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీటీసీ సభ్యుడు అల్లూరి రామ్మోహన్‌రావు ప్రారంభించారు. 11 పాఠశాలలకు చెందిన సుమారు 250 మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షార్ట్‌పుట్, టెన్నికాయిట్, వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. బాలికలు ఉత్సాహంగా ఆటలాడారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన బాలికలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోఆర్డినేటర్ జె.చిన్ను తెలిపారు. కార్యక్రమంలో పీసీ కమిటీ చైర్మన్ బి.రవి, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌ఎంయూ జిల్లా అధ్యక్షుడిగా గారపాటి



గారపాటి రామారావు

**జంగారెడ్డిగూడెం:** నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా గారపాటి రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జంగారెడ్డిగూడెం ఎన్‌ఎంయూ అసోసియేషన్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న గారపాటి రామారావు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు కార్మిక నాయకులు అభినందించారు. ఏలూరులో మంగళవారం జరిగిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నికైనట్టు రామారావు తెలిపారు. జిల్లా చైర్మన్‌గా షేక్ ఇమామ్, కార్యదర్శిగా బీఎస్‌రావు ఎన్నికైనట్టు చెప్పారు. ఆర్టీసీలో అతిపెద్ద అసోసియేషన్‌గా ఉన్న ఎన్‌ఎంయూకు ప్రభుత్వ గుర్తింపు లభించిందని, జీఓ విడుదల చేసిందని తెలిపారు. సెక్రటేరియట్‌లో మంగళవారం జీఏడీ సర్వీసుల డీప్యూటీ సెక్రెటరీ నాగమణి గుర్తింపు జీఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావుకు అందజేశారని వివరించారు.

# కొత్త పింఛన్ల పంపిణీ



చింతలపూడిలో కొత్త పింఛన్ అందిస్తున్న దృశ్యం

**చింతలపూడి:** సంక్షేమ ,పథకాల అమల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నారని నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు అన్నారు. మంగళవారం స్థానిక సచివాలయం-4 పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రతి నెలా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేస్తున్నట్టు దుర్గారావు చెప్పారు. చంద్రబాబు హయాంలో చనిపోయిన వారి స్థానంలోనే కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని గుర్తుచేశారు. నేడు అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మిరియాల దిలీప్, సొసైటీ అధ్యక్షుడు ఎ.సుబ్బారావు, సచివాలయ కార్యదర్శి రాజా, మాజీ ఎంపీటీసీ వై.కుమారి, ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ విజేత గుళ్లపూడి జట్టు



ట్రోఫీ అందుకుంటున్న గుళ్లపూడి జట్టు

**జంగారెడ్డిగూడెం:** వాలీబాల్ డివిజన్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా షూలను సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ నరసింహారాజు మంగళవారం అందజేశారు. జంగారెడ్డిగూడెంలో ఆయన క్రీడాకారులను అభినందించారు. ఈ నెల 10న ఆంధ్రప్రదేశ్‌లోని 11 జిల్లాల నుంచి 22 టీమ్‌లకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ మైదానంలో డివిజన్ స్థాయి పోటీలు నిర్వహించారని చెప్పారు. ఈ పోటీల్లో విజేతగా నిలిచిన ఏలూరు జిల్లా దొరమామిడి పంచాయతీ గుళ్లపూడి టీమ్ ఈ నెల 23న కోయంబత్తూర్‌లో ఇషా ఫౌండేషన్‌లోని ఆదియోగి వద్ద నిర్వహించే ఫైనల్ మ్యాచ్‌లకు ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొననున్నట్టు చెప్పారు. విజేతలకు ఇషా ఫౌండేషన్ ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం నిర్వాహకులు, డీఎస్పీ ధనుంజయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఇషా ఫౌండేషన్ వాలంటీర్స్, తిరుమలాపురం హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### కుంటి మల్లారెడ్ల సేవా సంఘ కార్యవర్గం ఎన్నిక



నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

**లింగపాలెం:** కుంటి మల్లా రెడ్ల సేవా సంఘం ఏలూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి పుట్టా చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం లింగపాలెం మండలం మఠంగూడెం గ్రామంలో కుంటి మల్లారెడ్డి స్వామి చిత్రపటం వద్ద సంఘం సభ్యులు నివాళులర్పించారు. జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా కె.రాధకృష్ణారెడ్డి, ఉపాధ్యాక్షుడు కె.రవీంద్రరెడ్డి, కార్యదర్శి నాగబాబురెడ్డి, సహాయ కార్యదర్శులుగా బద్రారెడ్డి, వంశీరెడ్డి, మరో 15 మంది సభ్యులను ఎన్నుకున్నట్టు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నూతన కమిటీ సభ్యులు ఏటా శివభక్త కుంటి మల్లారెడ్డి స్వామి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు.

# వేడుకగా మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

**ద్వారకాతిరుమల:** శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసుని మూడు రోజుల దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం నిర్వహించిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. పవిత్రావరోహణ, పూర్ణాహుతి, మహాశాంతి హోమాన్ని అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. ఆలయ పండితులు, అర్చకులు స్నపన, తిరుమంజనాలను చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లు, ఇతర దేవతామూర్తులపై ఉంచిన దివ్య పవిత్రాలను తొలగించారు. ఆ తరువాత యాగశాలలో మహా పూర్ణాహుతి వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ ఏఈఓ పి.నటరాజారావు పాల్గొన్నారు.

### ధాన్యం సేకరణ కమిటీ సమావేశం

**ఏలూరు(మెట్రో):** జిల్లా ధాన్యం సేకరణ కమిటీ రెండో సమావేశం ఏలూరు కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఖరీఫ్ 2023-24నకు ముందస్తు చర్యల్లో భాగంగా అవసరమైన గోనె సంచులు సమకూర్చటం, సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చుకోవాల్సిందిగా రైస్ మిల్లర్లకు, లారీ అసోసియేషన్ వారికి జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తగు సూచనలు చేశారు. ట్రాక్టర్లకూ జీపీఎస్ పరికరాలను అమర్చుకొనేలా అసోసియేషన్‌ను ఒప్పించాలన్నారు. మిల్లర్ల వద్ద ఉన్న 225 లారీలను, లారీ అసోసియేషన్ వద్ద ఉన్న 250 లారీలను ధాన్యం రవాణాకు అందుబాటులో ఉంచేలా చూడాలని ఆదేశించారు. సీజన్‌లో రోజుకు సుమారు 500 వాహనాలను అందుబాటులో ఉంచాలని, వాటికి జీపీఎస్ పరికరాలను అమర్చి ధాన్యం సేకరణ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

# చిన్నారికి ఆర్థిక సాయం



ఏలూరు ఆసుపత్రిలో ఆర్థిక సాయం అందిస్తున్న సహాయ సభ్యులు

**కామవరపుకోట:** ఇటీవల కొత్తూరులో రోడ్డు ప్రమాదానికి గురై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న చిన్నారి నందినికి సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ.28 వేలు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు మంగళవారం అందజేశారు. సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సేవలు ఆదర్శనీయమన్నారు. నందిని కాలికి తీవ్ర గాయాలు కావడంతో రెండు మూడు ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని, సుమారు రూ.4 లక్షలు ఖర్చవనున్నట్లు వైద్యులు తెలిపారని రమేష్ బాబు చెప్పారు. దాతలకు నందిని తల్లి విమలాదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వీరమల్ల మధు, నిజాపరపు దుర్గాప్రసాద్, వీరమల్ల సాజన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# సాక్ష్యాధారాలతోనే చంద్రబాబు అరెస్ట్

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

**పోలవరం రూరల్:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు విషయంలో ప్రభుత్వం లేదా ముఖ్యమంత్రి ప్రమేయం లేదని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం మండలం జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మంగళవారం నాగంపాలెం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబును అరెస్టు చేసే విషయంలో అన్ని సాక్ష్యాధారాలతో సీఐడీ అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచిందన్నారు. వీవీ వీఐపీకి భంగం కలగకుండా అరెస్టు నుంచి రిమాండ్ వరకు ఎక్కడా ఏ పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించారన్నారు. చంద్రబాబు అరెస్టును టీడీపీ తప్పుగా చిత్రీకరిస్తోందన్నారు. చంద్రబాబు పదవిలో ఉన్న సమయంలో కుట్ర చేసి ప్రజాధనాన్ని లూటీ చేశారని పేర్కొన్నారు. అన్ని విషయాలు ఏసీబీ కోర్టు పరిశీలించి జ్యుడీషియల్ రిమాండ్ విధించిందన్నారు. దీనిలో ప్రభుత్వ ప్రమేయంగాని, రాజకీయ దురుద్దేశంగాని ఏమీ లేవన్నారు. స్కిల్ కుంభకోణంలో అడ్డంగా దోచేసి చంద్రబాబు దొరికిపోయాడన్నారు. అవినీతి చేయడంలో చంద్రబాబు దిట్ట అని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో అనేక అక్రమాలు చేశారన్నారు. స్కిల్ స్కామ్‌తో పాటు అనేక అక్రమాలు చేశారన్నారు. తీగలాగడంతో డొంక కదిలిందని, ఒక్కొక్క కుంభకోణం బయటపడుతోందన్నారు. ప్రజలు ఛీకొడుతున్నారని, సానుభూతి పొందేందుకు చంద్రబాబు రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. అధికారం కోసం చంద్రబాబు తహతహలాడుతున్నారని, అయితే చట్టం అందరికీ ఒక్కటే అని, చట్టం ముందు ఎవరైనా తలదించుకోవాల్సిందే అన్నారు. అధికారంలో ఉండగా, అనేక తప్పిదాలు చేసి మేనేజ్ చేసి తప్పించుకున్నాడన్నారు. 2015లో దీనిపై విచారణ ప్రారంభమైందన్నారు. ఇప్పటికి పాపం పండిందన్నారు. న్యాయం, ధర్మం విజయం సాధించాయన్నారు. చౌకబారు రాజకీయం చేస్తూ, సానుభూతి కోసం దత్తపుత్రుడు కూడా ఎక్కువ హడావుడి చేస్తున్నాడన్నారు. అసలు పుత్రుడు కంటే దత్తపుత్రుతే ఎక్కువ బాధపడుతున్నాడన్నారు. అధికారంలోకి వస్తే మళ్లీ ఏదో చేసేస్తామంటూ లోకేష్ ప్రగల్బాలు పలకడం సమంజసం కాదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే చేసిన తప్పిదాలను నాడు మేనేజ్ చేశారని, ఇప్పుడు బయటపడుతున్నాయన్నారు. ప్రజల కోసం, దేశం కోసం ఉద్ధరిస్తున్నట్లు చంద్రబాబును అరెస్టు చేస్తే బంద్‌లు చేయాలని చెబితే ఎవరూ పెద్దగా స్పందించలేదన్నారు. తండ్రీకొడుకులు సానుభూతి కోసం పాకులాడుతున్నారని, ఆయనతో పాటు ప్యాకేజీ దత్తపుత్రుడు కూడా ఎంతో ఆరాటపడుతున్నారన్నారు. జనసేన అధ్యక్షుడా, టీడీపీ కార్యకర్తా అని ఆ పార్టీ కార్యకర్తలు కూడా తల బాదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ వి.వెంకటేశ్వరరావు, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జి-20 వేడుకలు



కళాశాలలో వివిధ దేశాల జెండా పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**చింతలపూడి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జి-20 వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు వివిధ దేశాల జెండా చిత్రాలను పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్ ద్వార ప్రదర్శించారు. జి-20 సమితి ప్రాముఖ్యత, వసుధైక కుటుంబం, ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు సారాశాంన్ని కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు వివరించారు. మనమంతా ఒక్కటే అనే భావన కలిగి ఉండాలని ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జి.జీవన మౌనిక విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వైభవంగా ఉరుసు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** స్థానిక శనివారపు పేట 6వ లైన్ సచివాలయం ఎదురుగా ఉన్న హాజరత్ సయ్యద్ జమాల్ షా బాబా మహాత్ముల వారి ఉరుసు సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముజావర్ ఎస్‌కే అమీర్ జానీ, కమిటీ సభ్యులు మాట్లాడుతూ తాత ముత్తాతల నుంచి ఉరుసు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దర్గా వద్దకు రావడానికి రోడ్డు సౌకర్యం లేదని, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరారు. తొలుత డప్పులు వాయిస్తూ జండాలు ఎక్కించారు. గంధం, గలాఫ్‌లతో ముజావర్లు పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దర్గా కమిటీ సభ్యులు, భక్తులు, ముజావర్లు కలిసి బాబాకు గలాఫ్ సమర్పించి గంధం పూశారు. రియాజ్ బేగ్ ఫాతెహా ఖానీ నిర్వహించి సర్వ మానవాళి సుఖశాంతులతో జీవించాలని ప్రార్థన చేశారు. ఉరుసుకు హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా ముజావర్లు ఎస్‌కే బాబు, కుటుంబ సభ్యులు, కమిటీ సభ్యులు ఎండీ సలాం, ఎస్‌కే బాజీ, ఎస్‌కే సత్తార్, అబు భాయ్ తదితరులు పాల్గొన్నారు.

### చీటింగ్ కేసు నమోదు

**జంగారెడ్డిగూడెం:** మట్టి రవాణా చేయించుకుని కిరాయి సొమ్ము ఇవ్వకుండా మోసం చేసిన నేరంపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. ఏఎస్సై తెలిపిన వివరాల ప్రకార.. కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామానికి చెందిన వేమగిరి బుజ్జి తన లారీతో జి.వినోద్, మరో వ్యక్తి కిరాయికి మట్టి తోలించుకున్నారు. పంగిడిగూడెం జగనన్న కాలనీకి 200 ట్రిప్పులు, కోర్టు వెనుక ఉన్న కాలేజీకి 10 ట్రిప్పులు, పేరంపేట రోడ్డులో అచ్యుత రామయ్య స్థలంలోకి 80 ట్రిప్పులు, పాత బస్టాండ్ వద్ద 60 ట్రిప్పులు మట్టిని తోలించుకున్నారు. దీనికి సంబంధించి కిరాయి సొమ్ము రూ.2 లక్షలు ఇవ్వకుండా మోసగించారు. దీనిపై కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఆ కేసును జంగారెడ్డిగూడెం స్టేషన్‌కు బదిలీ చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై మంగయ్య తెలిపారు.

### ఇద్దరు వ్యక్తులపై కేసు

**జంగారెడ్డిగూడెం:** పంట ధ్వంసంచేసిన నేరంపై ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. పంగిడిగూడెంకు చెందిన మాంద్రు నాగరాజు గ్రామంలో పొలాన్ని కౌలుకు తీసుకుని చిక్కుడు పంట సాగుచేస్తున్నాడు. పాతగొడవలు నేపథ్యంలో మాంద్రు గంగయ్య, మాంద్రు కృష్ణ పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి నాగరాజు, అతని భార్యను చంపుతానని బెదిరించారు. ఈ నెల 7న రాత్రి సమయంలో వీరిద్దరూ పొలంలోకి ప్రవేశించి చిక్కుడు పంటను ధ్వంసం చేశారు. దీంతో నాగరాజుకు రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ మేరకు నాగరాజు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఏఎస్సై మంగయ్య తెలిపారు.